# పరంపర

**- చిమ్మని మనోహర్**

"రాస్కెల్! నువ్వు నన్ను పెళ్ళి చేసుకోనన్నా నాక్కోపం రాలేదు. కాని ఎందరితోనో తిరిగానని నామీద అభాండం వేశావు చూడు.. అందుకురా నిన్ను చెప్పుతో కొట్టింది.! నీలాంటివాణ్ని పెళ్ళి చేసుకునేకంటే అబార్షన్ చేయించుకోవడమే మంచిది!" మిగిలిన ఇంకో చెప్పుని కూడా అతని మొహం మీదకే విసిరేసి బయటకు నడిచింది సుశీల.

చిన్నప్పట్నించీ సుశీల తత్వమే అంత. మామూలుగా ఆడపిల్లల్లో వుండే బిడియం, సిగ్గుతో ముడుచుకుపోవడం వంటి లక్షణాలేవీ సుశీలలో రాలేదు. స్కూల్లో మగపిల్లల్తో సమానంగా ఆటల్లోనూ, పాటల్లోనూ పాల్గొనేది. అవసరమైతే వారితో పోట్లాటకైనా సరే వెనుకాడేది కాదు. సుశీలలోని ఈ దూకుడుతనానికి పగ్గాలు వేయాలనుకున్న ఆమె తల్లిదండ్రులకు అది సాధ్యం కాలేదు.

సుశీలతోపాటే పుట్టిన చొరవ-చైతన్యం, ఉత్సాహం-ఉద్వేగం.. ఆమెతోపాటే ఎదిగాయి. ఏ విషయంపైనైనా స్పష్టమైన-అవగాహనతో మాట్లాడేది. తనవాదనతో లెక్చరర్లను సైతం తప్పుపట్టడానికి వెనుకాడేది కాదు. ఒక విషయాన్ని అనవసరంగా నాన్చడం, పదే పదే ఆలోచిస్తూ సమయాన్ని వృధా చేయడం వంటివి ఆమెకు నచ్చేవి కావు. అవసరమైనప్పుడు క్షణాల్లో నిర్ణయం తీసుకుని తను చేయాలనుకున్నది చేసెయ్యడం వంటి గుణాలు సుశీలలోని ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించేవి.

అటువంటి ఆత్మవిశ్వాసంతోనే వినోద్‌ని ప్రేమించింది సుశీల. బి.ఇడి. చదువుతుండగా ఓ ఎన్.ఎస్.ఎస్. క్యాంపులో వినోద్‌తో పరిచయమైందామెకు. వెకిలి చేష్టలతోనో, ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుతో మితిమీరిన సిన్సియారిటీని ప్రదర్శిస్తూనో అమ్మాయిల్ని ఆకర్షించాలన్న తపన వినోద్‌లో ఆమెకు కనపించలేదు. సూటిగా కళ్ళల్లోకి చూస్తూ, మనసులోని మాటను చెప్పేసే వినోద్ ఆ సమయంలో సుశీలకు చాలా బాగా నచ్చాడు.

కొంతకాలంపాటు కబుర్లవరకే పరిమితమైన వారి ప్రేమ, ఆ పరిమితిని దాటటానికి ఎంతోకాలం పట్టలేదు. ఓ సాయంత్రం తన గదిలో కబుర్లమధ్య సుశీల చేతిని తన చేతిలోకి తీసుకుని, 'ఆ అనుభవం' ఎలా వుంటుందో చూడాలని వుందన్నాడు. సుశీల వయసు ఆమెను ఆలోచించ నివ్వలేదు. దానికి తోడు, సుశీలలోని మితిమీరిన ఆత్మవిశ్వాసం వెనుకదాగిన అమాయకత్వం 'సరే' నంది. ఆతర్వాత వాళ్ళు ఎన్నిసార్లు ఆ అనుభవాన్ని చవి చూశారో ఎవరూ లెక్కించలేదు.

బి.ఇడి. ఫలితాలొచ్చాయి. సుశీల ఫస్ట్‌క్లాస్‌లో పాసయింది. అదే రోజు సుశీల వాంతి చేసుకుంది. చివరిసారిగా తనకు ఎప్పుడు పీరియడ్ వచ్చిందో గుర్తుకు రాలేదు. ఆమె అనుమానాన్ని డాక్టర్ కన్ఫర్మ్ చేసింది. అప్పటికి కూడా సుశీలలో భయం, తడబాటువంటివి ఏమీ కలగలేదు. అక్కన్నించి నేరుగా వినోద్ రూంకు బయల్దేరింది.

సుశీల వెళ్ళేసరికి వినోద్ రూంలోనే వున్నాడు. అతని చేతిలో ఆడవాళ్ళను 'ఇన్‌ఫ్లుయన్స్' చేసి గెలవ్వచ్చో తెలిపే ఓ చవకబారు ఇంగ్లీషు పుస్తకముంది. సుశీలను చూడగానే కంగ్రాట్స్ చెప్పాడు వినోద్. అతను కూడా ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడని తెల్సుకుని సుశీలకూడా కంగ్రాట్స్ చెప్పింది.

"మనం పెళ్ళెప్పుడు చేసుకుందాం?" సూటిగా అడిగింది సుశీల.

"ఉన్నట్టుండి ఇదేంటి -పెళ్ళి గురించి అడుగుతున్నావు?" నవ్వుతూనే ఆశ్చర్యంగా అన్నాడు వినోద్.

"సమాధానం చెప్పు సుశీల నవ్వలేదు.

"ఈ క్షణం వరకు నా పెళ్ళి గురించి ఆలోచించలేదు నేను. చదువు పూర్తయ్యి నేను అనుకున్నట్టు స్థిరపడ్డ తర్వాతగాని చేసుకోను."

"కాని ......నేనిప్పుడు ప్రెగ్నెంటుని"

"అదా సంగతి.... ఏం వర్రీకాకు. అబార్షన్‌చేయించుకోవచ్చు"-ఎటువంటి తడబాటు లేకుండా, ఎప్పట్లాగే సూటిగా అన్నాడు వినోద్.

"ఎప్పటికయినా మనం పెళ్ళి చేసుకోవాల్సిందేగా?"

"ఆమాట నేనెప్పుడూ అన్లేదే!"

ఊహించని ఈ సమాధానానికి సుశీల మొహంలోకి ఆవేశంతో రక్తం పొంగుకొచ్చింది.

'మరేమనుకుని నాతో సెక్సులో పాల్గొన్నావు?"

"జస్ట్ ఫర్ ఫన్! అంతే.... అయినా పెళ్ళి చేసుకుంటానని మాటివ్వని నావంటి వానితోనే గడిపిన దానివి. ఇంతకుముందు ఇంకెంతమందితో తిరాగావో ! నిన్నెలా పెళ్ళి...." అతని మాటలు పూర్తికాకముందే తనకాలికున్న చెప్పుతీసి వినోద్ మొహం మీదకువిసిరేసింది సుశీల.....

రోడ్డుమీద నడుస్తూ ఆలోచించసాగింది సుశీల. ఇన్నాళ్ళూ తనొక భ్రమలో వున్నానన్న వాస్తవమే ఆమెను ఎక్కువగా బాధపెట్టింది. అయితే కొంచెం ఆలస్యమైనా, ఇప్పుడా భ్రమలోంచి బయట పడినందుకు మాత్రం ఆనందంగా వుందామెకు.

కాళ్ళకి చెప్పుల్లేకుండా అలాగే వట్టికాళ్ళతో నడుస్తూ ఇంటికి చేరింది సుశీల. ఇంట్లో మరోసారి వాంతి చేసుకుంది. అప్పటికే అనుమానంగా చూస్తున్న తల్లిదగ్గర ఇంక దాచటంలో అర్థం లేదనిపించింది. ఆమె అడగకముందే నెమ్మదిగా తనే చెప్పింది. ఆ తర్వాత ఇంట్లో జరిగిన పరిణామాలను కలలో కూడాఎన్నడూ ఊహించలేదు సుశీల.

ఇరవయ్యేళ్ళుగా తనని ఒక్కమాట అనని తండ్రి నోటినుంచి ఎప్పుడూ వినని అసహ్యకరమైన బూతుమాటలొచ్చాయి. చంపేస్తే పీడ వదలుతుందంటూ నాలుగయిదుసార్లు గొంతు నులమడానికి మీదకొచ్చాడు. కాని, అంతధైర్యం లేదాయనకు. వీపు మీద పిడికిలితో గుద్దాడు. కాలితో ఇష్టం వచ్చినట్లు తన్నాడు. ఎదిగిన కూతుర్ని తండ్రి కొడుతున్నా తల్లి అడ్డురాలేదు.



ౖగా తనుకూడా ఏవో శాపనార్థాలు పెడుతూనే వుంది.. 'విషయం " అర్థమైందేమో, తమ్ముడు కూడా "ఛీ... ఇటువంటి మనుషులున్న ఇంట్లో వుండాలంటేనే అసహ్యంగా వుంది" అంటూ విసురుగా బయటకెళ్ళాడు.

ఆ రాత్రి పక్కగదిలోంచి తల్లిదండ్రుల సంభాషణ ఎంత వినకూడదనుకున్నా సుశీల చెవులకి చాలా స్పష్టంగా వినిపించింది.

"...ముక్కుసూటిగా పోయేమనిషి, ఏ తప్పూ చేయదనుకున్నాం ఇన్నాళ్ళూ! ఇప్పుడిలా చేసింది. నలుగురికీ తెలిసిందంటే నేను వురేసుకుంటాను".

"మీరు నాలుగురోజులు ఓపిక పట్టండి. వాడెవడో నేను నెమ్మదిగా కనుక్కుంటాను. బెదిరిస్తే పెళ్ళి చేసుకోకపోడు..పైగా కట్నం ఖర్చు కూడా తప్పుతుంది..." -ఇంక వినదల్చుకోలేదు సుశీల. బ్లాంకెట్‌ని నిండా కప్పుకుని మరోవైపు తిరిగిపడుకుంది.

అనుకున్నట్టే మర్నాడు ఉదయం తల్లి బుజ్జగిస్తున్నట్టుగా, నెమ్మదిగా అడిగింది సుశీలను- 'ఎవరు?' అంటూ.

"అతన్ని నేను పెళ్ళి చేసుకునే వుద్దేశ్యమే లేదు. ఇంక పేరు అనవసరం" ఖచ్చితంగా చెప్పింది సుశీల.

తర్వాత అదే ప్రశ్నను తండ్రి బూతుమాటల్తో అడిగాడు.నోరు విప్పలేదు సుశీల. అలా ఓ వారం గడిచింది. మధ్యలో ఓ సారి కాలేజీకి వెళ్ళిమెమో ప్రొవిజనల్ సర్టిఫికెట్లు తెచ్చుకుంది. ఓ రోజు సుశీల తమ్ముడు కాలేజీ నుంచి రాగానే తండ్రి అతన్ని పట్టుకున్నాడు- "ఒరే! అది చెప్పడం లేదుగాని, నువ్వయినా కొన్త ఎంక్వయిరీచెయ్యి ఎవరో ఏవిటో..." అన్నాడు.

"ఏమని ఎంక్వయిరీ చెయ్యాలి నాన్నా! సోషల్‌గా అందరితో తిరిగేదిగా... ఒక్కడే అని గ్యారంటీ ఏంటి?" అంటూ పక్కగదిలోకి విసురుగా వెళ్ళిపోయాడు సుశీల తమ్ముడు.

ఈ సారి సుశీలకు కోపం రాలేదు. అదేరాత్రి ఓ నిర్ణయం తీసుకుని హైద్రాబాద్‌లో వున్న తన స్నేహితురాలు రజని దగ్గరకి బయల్దేరింది. తన దగ్గిరున్న అడ్రస్‌తో రజని వుంటున్న హాస్టల్ అడ్రస్ కనుక్కోవడం పెద్ద కష్టం కాలేదు. సుశీలకు. డిగ్రీ అవుతూనే క్లర్క్స్‌గ్రేడ్ పరీక్షరాసి ఉద్యోగం సంపాదించుకుంది రజని. వర్కింగ్ వుమెన్స్ హాస్టల్లో ఒక్కతే ఉంటోంది.

"అయితే ఇప్పుడేం చేయాలను కుంటున్నావు?" అంతా విన్న తర్వాత అడిగింది రజని.

"ప్రస్తుతానికి ఏదైనా జాబ్‌లో చేర్తాను. ఇక యిదంటావా.... అబార్షన్ చేయించుకోవాలని ఎప్పుడో నిర్ణయించు కున్నాను" స్థిరంగా అంది సుశీల.

మర్నాడు ఉదయం ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంలో అబార్షన్ టేబుల్ మీదుంది సుశీల.కాళ్ళ మధ్య స్టెయిన్‌లెస్ స్టీల్ పరికరాలు చేస్తున్న శబ్దాలు అస్పష్టంగా వినిపిస్తోంటే, తన శరీరంలోని కొంత భాగాన్ని నిర్దాక్షిణ్యంగా తొలుస్తున్నట్టుగా అనిపించిందామెకు. కొద్దిసేపటి తర్వాత రజని వచ్చింది.

"ఇంటికెళ్ళి విశ్రాంతి తీసుకోవచ్చున్నారు డాక్టర్ వెళ్దామా?" సుశీల చేతిని తన చేతిలోకి తీసుకుని నెమ్మదిగా నొక్కుతూ అంది రజని.

"నో సెంటిమెంట్స్!" ఇద్దరి నోటినుంచీ ఒక్కసారే వచ్చిందామాట. పదినిమిషాల తర్వాత వాళ్ళిద్దరు కూర్చున ఆటో వర్కింగ్ వుమెన్స్ హాస్టల్‌వైపు బయల్దేరింది.


వారం రోజుల తర్వాత ఓ స్కూల్లో టీచర్‌గా చేరింది సుశీల. జీతం చాలా తక్కువే అయినా ఎలాగో రెండు నెలలు పనిచేసింది. ఓ రోజు సాయంత్రం రజని ఆఫీసు నుంచి రాగానే ఓ పేపర్ కటింగ్ సుశీల చేతికిచ్చింది. ఒక దినపత్రికలో సబ్‌ఎడిటర్ ఉద్యోగాలకోసం యిచ్చిన ప్రకటన అది. రజని ప్రోత్సాహంతో

## ఓ పాపా! నిదురించకే....

ఎస్.జయ

కంటి పాపలా
నిన్ను కాపాడుకుంటూనే
కమ్మని కలలు కంటూ
నిద్రపొమ్మని
జోలపాటలు నీకు పాడలేను
ఆదమరిచి నువ్వు నిద్రిస్తే
భవిషద్ధారంతా పల్లేరుగాయలు

చందమామను చూపి
రగులుతున్న బతుకు కుంపటి అంటాను
నీకు నడక నేర్పుతూ
నువ్వు అడుగుదీసి అడుగేసేలోగా
కుడి ఎడమల
ప్రమాద సూచికలు నాటుతాను
మాటలు నేర్పుతూ
చరిత్ర చీకటి కోణాల కరుకు సత్యాల
కన్నీటి గాథల్ని వినిపిస్తాను
పాలుగారే పసితనంలోనే
'యుద్ధ తంత్రం' నేర్వాలి నీవు
భయ విహ్వలవై
అడుగు వెనక్కివేశావో
తరతరాల ఊబి కబళిస్తుంది
మాయా మోహాలలో
మనసు పారేసుకొని
శరణార్థిలా



భద్రతా వలయంలో
ఒంటరిగా మిగలొద్దు
మోడువారిన తాళ్లతో బిగిసిన
రుణానుబంధాల కట్టుకథలు తెంచి
అనురాగాలు పుష్పించే
కొత్త చరిత్రను
సృష్టించాలి నువ్వైనా ! * *

సుశీల అప్లయి చేసింది. ఎన్నో పోటీల్లో బహుమతులందుకున్న సుశీలకు రాత పరీక్షగాని, ఇంటర్వ్యూగాని కష్టమని పించలేదు. నెలరోజుల తర్వాత సబ్‌ఎడిటర్‌గా సెలక్టు చేసుకున్నట్టు ఆ పత్రికాఫీసు నుంచి సుశీలకు లెటరొచ్చింది.

మొట్టమొదటిరోజు పత్రికాఫీసులోకి అడుగుపెడుటూ ఏమేమో సాధించాల నుకుంది సుశీల. అయితే అక్కడి వాతావరణం ఆమె ఊహించినదానికి పూర్తి వ్యతిరేకంగా వుంది. రచ్చబండ రాజకీయాలుమాట్లాడేవాళ్ళు కొందరయితే, షేర్ల హెచ్చుతగ్గుల గురించి చెప్పుకునేవాళ్ళు మరికొందరు. ఏ కొద్దిమందిలోనో తప్ప తమవృత్తి పట్లగాని, దానికున్న ప్రాముఖ్యత పైగాని నిజమైన స్పృహలేదు. అంతా యాంత్రికత్వం. చైతన్యరహితం ముందు కొంచెం నిరుత్సాహపడినా, క్రమంగా పత్రికాఫీసులోని పనికీ, ఆ పరిసరాలకూ సుశీల అలవాటుపడింది.

సబ్‌ఎడిటర్లలో చాలామంది పోస్ట్‌గ్రాడ్యు యేట్లున్నారు. చాలామంది అవసరంకోసమే ఆ ఉద్యోగంలో చేరారు తప్ప అభిరుచితో కాదు. సాహిత్యంపట్ల అనక్తివున్నవారే కాకుండా, అప్పుడప్పుడూ కవితలూ, కథలూ రాసేవాళ్ళుకూడా కొంతమంది తనతోపాటే సబ్‌ఎడిటర్లుగా పనిచేస్తూండటం సుశీల గమనించింది.

అక్కడే రవీంద్రతో పరిచయమైంది సుశీలకు. ఆధునిక వచనకవిత్వంలో 'అత్యాధునికత'తో ఈ మధ్య కాలంలో బాగా గుర్తింపుపొందిన యువకవి రవీంద్ర. ఆఫీసులో సిటీడెస్కు చూసుకుంటాడతను. రవీంద్ర పరిచయం సుశీలలో చదివే అలవాటుని మరింత విస్తృతం చేసింది.. చలం, రచనలు సుశీలను బాగా ఆకర్షించాయి. కొద్దిగా సమయం దొరికితే చాలు- వీరిద్దరి రచనల పై ఇద్దరూ చర్చలు మొదలెట్టేవారు. ఒక్కోసారి పుట్‌పాత్‌లు, బస్‌స్టాపులే గంటలకొద్దీ వాళ్ళు జరిపే చర్చలకు వేదికలయ్యేవి. స్త్రీల సమస్యలపై, స్త్రీ విమోచన సిద్ధాంతాలపై, ఉద్యమాలపై రవీంద్రకున్న అవగాహన సుశీలకు ఆశ్చర్యాన్ని కలిగించేది. అతని భావాలు సుశీలను బాగా ఆకట్టుకున్నాయి. క్రమంగా అతనిమీద ఇష్టం కలుగసాగింది సుశీలకు.

ఓ సెలవురోజు సుశీలను నల్లకుంటలో వున్న తన గదికి ఆహ్వానించాడు రవీంద్ర. అభ్యంతరం చెప్పడానికి సుశీలకు ఏకారణమూ కన్పించలేదు. పైగా తనువుండే హాస్టల్‌కి కొంచె దగ్గిరే అవటంతో ఒప్పుకుంది.

రవీంద్ర రూంలోవున్న వందలకొద్దీ పుస్తకాల్ని చూసి నిజంగానే ఆశ్చర్యపోయింది సుశీల. కొడవటిగంటి, తిలక్, చలం, ... ఇంకా ఎందరివో పూర్తి రచనలున్నాయి. సోవియట్ అనువాద పుస్తకాలు, హెచ్.బి.టి. పుస్తకాలు గోడకేవున్న షెల్ఫ్‌లో సర్దాడు. మిగిలినవన్నీ నీట్‌గా కిందే పేపర్‌మీద వరుసగా పేర్చాడు. గదిలో మరో మూలన ఓ ఇనుప మడత మంచం, వంటకోసం ఓ కిరోసిన్ స్టవ్, కొన్ని సామాన్లున్నాయి.

సుశీల పుస్తకాలు చూస్తుండగానే కాఫీ కలిపిచ్చాడు రవీంద్ర.


"పుస్తకాలు చాలా కొన్నారు !" కాఫీ తాగుతూ అంది సుశీల.

"అవును. నాకున్న వ్యసనం ఇదొక్కటే! నా జీవితంలో ఖచ్చితంగా కొంతభాగం పుస్తకాలు కొనడానికే ఖర్చు చేస్తాను.

"వీటిలో నేను చదవాల్సినవి చాలా వున్నాయి. మిమ్మల్ని ఇబ్బంది పెడ్తుంటాని కమీదట!' నవ్వుతూ అంది సుశీల.

సుశీల పుస్తకాలు చూస్తున్నంతసేపు ఇద్దరికీ వంటకూడా పూర్తిచేశాడు రవీంద్ర. భోజనం ముగించాక కొద్దిసేపు చర్చలు జరిపారిద్దరూ. తర్వాత ఎం.ఎన్.రాయ్ పుస్తకాన్నొకదాన్ని తీసుకుని హాస్టల్‌కు బయల్దే రింది సుశీల.

ఆ తర్వాత రవీంద్రకు మరింత చేరువైంది సుశీల. ఓ ఆరునెలల తర్వాత ఇద్దరూ కల్సి జీవించడానికి నిర్ణయం తీసుకున్నారు. రిజిస్ట్రార్ ఆఫీసులో రజని, మరికొందరు కొలీగ్స్ సమక్షంలో సంతకాలు చేశారిద్దరూ. రవీంద్రని తన జీవితంలోకి ఆహ్వానించాక సుశీల జీవితంలో త్వరత్వరగా ఎన్నో మార్పులు సంభవించాయి. విపరీతంగా పుస్తకాలు చదవడం, రవీంద్రతోపాటు అభ్యుదయ




సాహితీ మిత్రులతో చర్చల్లో, సమావేశాల్లో పాల్గొనడం విస్తృతమయ్యాయి. పత్రికలకు కథలు, కవితలు, వ్యాసాలు రాయడం ప్రారంభించింది. రవీంద్ర ప్రోత్సాహంతోనే స్త్రీ విముక్తి సంఘంలో కూడా చేరింది. చూస్తుండగానే రెండేళ్ళు గడిచాయి.

సుశీలలో సహజంగా వున్న చొరవ, ఉత్సాహం, దేన్నయినా ఎదుర్కోగల ఆత్మ విశ్వాసం ఆమెను స్త్రీ విముక్తి కార్య కలాపాల్లో పూర్తిగా మునిగిపోయేట్టు చేశాయి. ఒకటిరెండుసార్లు ఆమె కథలు సాహితీపేజీల్లో చర్చనీయాంశాలయ్యాయి. ఇంటిదగ్గర ఆమెకోసం వచ్చే సాహితీమిత్రులు, స్త్రీవిముక్తి కార్యకర్తల సంఖ్య ఎక్కువైంది. క్రమంగా రవీంద్రలో మార్పు రాసాగింది. సుశీల ముందు తన ఉనికి వెలవెలా పోతున్నట్లు భావించాడు. ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సు ఎక్కువైంది. ఇదివరకులా పత్రికలకి కవితలు కూడా రాయలేకపోతున్నాడు. చివరికి సుశీలకు పేరు రావడాన్ని సహించలేని స్థాయికి దిగజారిపోయాడు.

స్త్రీవిముక్తి కార్యకలాపాలు తగ్గించు కొమని, ఆరోగ్యం పాడవుతుందని కొద్దిరోజులు పరోక్షంగా సుశీలకు సూచించాడు రవీంద్ర. సుశీల తేలిగ్గా కొట్టిపారేసింది. లాభం లేదనుకున్నాడో ఏమో - ఓ రోజు డైరెక్టుగానే తన వుద్దేశ్యాన్ని బయటపెట్టాడు.

"యాక్టివిటీస్ మరీ ఎక్కువైపోతున్నాయి. పేరు కూడా కావల్సినంత వచ్చింది.... ఇక ఇవన్నీ తగ్గించుకొంటే మంచిది" అన్నాడు.

రవీంద్రవైపు అపనమ్మకంగా చూసింది సుశీల. ఒకప్పుడు చలం గురించి, మార్క్స్ గురించి, మేరీ వెడగేజ్ గురించి, మార్గరేట్ సాంగర్ గురించి, జెర్మన్‌గ్రీర్ పుస్తకాల గురించీ... ఎన్నెన్నో చెప్పిన రవీంద్రలో మొట్టమొదటిసారిగా ఓ సగటు మగవాని ఛాయల్ని స్పష్టంగా గమనించిందామె.

"నేనేదీ పేరుకోసం చేయడంలేదు.

చేయకూడని పనులు కూడా చేయడం లేదు. ఇవన్నీ తగ్గించుకోమని ఎందుకంటున్నావో కారణం చెప్పు?"

"చర్చలు అనవసరం. నేను చెప్పినట్టు అన్నీ తగ్గించుకుని మామూలుగా వుండేట్టయితే నాతో వుండు. లేదంటే.... నీదారి నువ్వు చూసుకోవచ్చు."

సుశీల అనుమానం నిజమే అయ్యింది. తనదాకా వచ్చేసరికి రవీంద్రలోని అభ్యుదయవాదిలో కూడా ఆంక్షలతో అధికారం చెలాయించే మగ దురహంకారం నిద్ర లేచింది. అయితే, సుశీల రాజీ పడదల్చుకోలేదు.

"మనం విడిపోదాం" నెమ్మదిగా, స్థిరంగా అంది.

రవీంద్ర మొహం అవమానంతో ఎర్రబడింది. ఆవేశం కట్టలు తెచ్చుకుంది.

"విడిపోడానిక్కూడా సిద్ధపడ్డావన్నమాట! అవును మరి.... కాలేజీలో వాడెవడితోనో తిరిగావు. ఇప్పుడు నేను కూడా సరిపోవడం లేదు. ఒక్కడితో లక్షణంగా బ్రతికేరకం కాదుగా!" అంటూ వేగంగా బయటికెళ్ళిపోయాడు రవీంద్ర.

చాలాసేపు సుశీల అలాగే అచేతనంగా నిలబడిపోయింది. ఆ సాయంకాలమే స్త్రీ విముక్తి సంఘకార్యకర్త ఒకరి సహాయంతో రాంనగర్లో ఇల్లు చూసుకుని వచ్చి, తన సామాన్లతో బయటపడింది సుశీల.


రవీంద్రతో సంబంధం తెంచుకుని బయటపడ్డ తర్వాత సుశీలకు జీవితం స్వేచ్ఛగా అనిపించసాగింది. తను, తనపుస్తకాలు, కథలు, కార్య కలాపాలు .....అంతా తన ఇష్టం. ఎవరి వత్తిడులు, ఆక్షేపణలు లేవు. క్రమంగా ఆమె పాల్గొనే స్త్రీ విముక్తి కార్యకలాపాలు గ్రామాల్లోకి కూడా విస్తరించాయి. ధనిక భూస్వామ్య వర్గాలు, పీడితబడుగు వర్గాల మధ్య జీవన వైరుధ్యం గ్రామాల్లో కళ్ళకు కట్టినట్టు చూసింది సుశీల. సిటీలో కాపిటలిస్టు సంస్కృతి విసర్జించిన చెత్త చెదారంతో సహవాసం చేస్తూ, మురికి కాలువలను ఆనుకుని బ్రతికే గుడిసెవాసుల జీవితం కూడా ఆమెను కదిలించింది. రవీంద్ర పరిచయంతో మొట్టమొదటిసారిగా కమ్యూనిజం వైపు ఆకర్షించబడిన సుశీల, ఎం.ఎల్ పార్టీ సిద్ధాంతాల పట్ల కూడా ఆకర్షితురాలు కావడానికి ఆమె చదివిన సాహిత్యంతోపాటు, స్త్రీ విముక్తి కార్యకలాపాలు బాగా తోడ్పడ్డాయి.

ముఖ్యంగా స్త్రీ విముక్తి సంఘ కార్యకర్తగా గ్రామీణప్రాంతాల్లో తిరిగినప్పుడు ఆమె చేసిన సంఘటనలు, ఆమెకెదురయిన అనుభవాలు ఆమెలో ఈ దృక్పథం మరింతగా బలంగా నాటుకుపోవడానికి తోడ్పడ్డాయి. పార్టీ సానుభూతి పరులైన మేధావులతో పరిచయాలు, సమావేశాలు ఎక్కువయ్యాయి. క్రమంగా ఆ పరిచయాలు సుశీలను పార్టీ తీవ్రవాద కార్యకర్తలైన నక్సలైట్లకు చేరువగా తీసుకెళ్ళాయి.

ముందు కొంతకాలం సానుభూతి పరురాలిగా సిటీలోనే వుంటూ నక్సలైట్లకు అవసరమైన సహాయం చేసేది సుశీల. తర్వాత తర్వాత గ్రామాల్లో పనిచేసే పార్టీకార్యకర్తలతో సంబంధాలు పెరిగాయి. ఆ తర్వాత ప్రభుత్వం, పాలసీలు మారడంతో రాష్ట్రంలో పోలీసు నిర్బంధం ఎక్కువైంది. చివరికి సుశీల కూడా 'అజ్ఞాతం' లోకి వెళ్ళక తప్పలేదు. సుశీల జీవితంలో ఇది మరో ప్రధానమైన మలుపయింది.

ఆశ్చర్యపోయింది సుశీల. అతని తండ్రి కరీంనగర్ జిల్లాలో పెద్ద భూస్వామి. లా చదువుకునే వరకూ కేవలం పార్టీ సానుభూతి పరునిగానే వుండి, తర్వాత పూర్తిస్థాయి ఆర్గనైజర్గా పార్టీలో చేరిపోయాడు. అంకిత భావంతో పార్టీకోసం తానుపనిచేయడమే కాకుండా, సభ్యులందర్నీ కూడా ఎప్పుడూ యాక్టివ్గా వుంచుతాడు సత్తిరెడ్డి. అయితే పార్టీలో ఎంతోమంది విద్యాధికులున్నారన్న వాస్తవాన్ని సుశీల తర్వాత తెలుసుకుంది. పార్టీలో నాయకత్వం కోసం జరిగే పోట్లాటలు, కులాలవారిగా నాయకత్వాలు వంటి అంతర్గత కుమ్ములాటలు, కార్యకర్తలు చేసే దుర్మార్గాలు వంటివి కూడా నెమ్మదిగా సుశీల దృష్టికి రాసాగాయి..

ఓ సాయంత్రం దళం విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో సత్తిరెడ్డి సుశీల దగ్గరికొచ్చి తనతో వెంటనే రమ్మన్నాడు. రైఫిల్, బ్యాగ్ తీసుకొంటూంటే వద్దనటంతో




దళంలో ఆర్గనైజర్గా చేరిన తర్వాత సుశీల 'సుశీలక్క'గా మారింది. నడుముకింది వరకుండే జుట్టుని దగ్గరగా కత్తిరించుకుంది. ఆలివ్ గ్రీన్ దుస్తులు, అడవిజీవితం అలవాటయ్యాయి. అన్నలతో కల్సి ఎక్కడికైనా నిర్భయంగా వెళ్ళడం, ప్రజాకోర్టులు, సమావేశాలు నిర్వహించడం మామూలయిపోయింది. స్కూల్లోనూ, కాలేజీలోనూ పాడిన సుశీల గొంతు మళ్ళీ అడవిలో ప్రతిధ్వనించింది. ఎన్కౌంటర్లలో మరణించిన అన్నలనూ, అక్కలను తల్చుకొంటూ కట్టిన పాటలను సుశీల గొంతెత్తి పాడుతుంటే మిగిలిన సభ్యులంతా వంత కలిపేవాళ్ళు.

దళంలో మరో ఆర్గనైజర్ సత్తిరెడ్డి అలియాస్ రాజన్నకు నాయకుడుగా పార్టీలో మంచిపేరుంది. అతను ఎమ్మే ఎల్లెల్బీ, లా చదివాడన్న విషయం తెలిసినప్పుడు

వాటినక్కడే వదిలేసి అతన్ని అనుసరించింది సుశీల. కొద్ది నిముషాల్లోనే అతడు ఎప్పట్లా లేడన్న విషయాన్ని గమనించింది. నెమ్మదిగా, చాలా జాగ్రత్తగా అడుగులేస్తున్నాడు. ఏమీ మాట్లాడ్డం లేదు. తాగి వున్నాడని అర్థమైంది సుశీలకు. ఉద్యమంలో వున్న చాలామంది సభ్యులు గ్రామాల్లో దొరిగే కల్లు, నాటుసారా తరచూ తాగుతూనే వుంటారని సుశీలకి తెలుసు. కానీ, ఒక మహోన్నతమైన లక్ష్యాన్ని సాధించడం కోసం ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తున్న సత్తిరెడ్డివంటి నాయకులు కూడా ఇలా వ్యసనాలకు బానిసలైవుండటం ఆ ఉద్యమంలో ఒక అపశ్రుతిగా అనిపించింది సుశీలకు.

నడుస్తున్నవాడల్లా ఒక్కసారిగా ఆగిపోయి సుశీల చేయిపట్టుకున్నాడు సత్తిరెడ్డి. ఊహించని ఈ చర్యకి ఒక్కక్షణం

విస్తుపోయింది సుశీల. విషయం పూర్తిగా అర్థమైంది 'వదులు' అంటూ చెయ్యివిడిపించుకోడానికి ప్రయత్నించింది. అతను తన పట్టు వదల్లేదు.

"అనవసరంగా గొడవ చెయ్యకు... ఇది మామూలే! నువ్వు అరచినా, ఏడ్చినా ఎవ్వరూ రారు. తొందరగా కానిచ్చి వెళ్దాం" అంటూ గడ్డిలో వెనక్కితోసేసి మీదపడ్డాడు.

సుశీల అరిచింది. పెనుగులాడింది. పోరాడింది. చివరికి సత్తిరెడ్డి బలం ముందు ఓడిపోయి లొంగిపోక తప్పలేదు.

"పతివ్రతలా అంత బెట్టు చేశావెందుకు - నీ రంకు చరిత్ర ఎవడికి తెలీదు ! రైఫిల్ దగ్గరుంది కదాని పిచ్చిపిచ్చి వేషాలు వెయ్యకు. చస్తావు." - పది నిమిషాల తర్వాత వెళ్తూ వెళ్తూ వార్నింగిచ్చి వెళ్ళాడు సత్తిరెడ్డి.

ఆతర్వాత సత్తిరెడ్డి కోరినప్పుడల్లా నిస్సహాయంగా లొంగిపోక తప్పలేదు సుశీలకు. దళంలో వున్న మరో ఇద్దరు స్త్రీలు, ఇతర సభ్యులు జరిగింది తెలిసినా, ఇదంతా మామూలే అన్నట్లు ఎవరూ ఏమీ పట్టించుకోలేదు. సత్తిరెడ్డిని చంపేస్తే అక్కన్నుంచి ప్రాణాల్తో బయటపడటం అసాధ్యమని తెలుసుకుంది. అందుకే సత్తిరెడ్డిని తుపాకితో కసిదీరా తూట్లు పడేట్లు కాల్చేయాలన్న ఆవేశాన్ని ఎప్పటికప్పుడు అదుపులో పెట్టుకోడానికి సుశీల చాలా కష్టపడాల్సి వచ్చింది. దళాన్ని వదిలి పారిపోయే అవకాశం కోసం ఎదురు చూడసాగింది సుశీల.

సుశీలకు ఆ అవకాశం రెండునెలల తర్వాత వచ్చింది. బయటి ప్రపంచంలోకి రాగానే పోలీసులకు లొంగిపోయింది. హోంమంత్రి తనపేరుకోసం ఈ ప్రక్రియనంతా ఓ ప్రహసనంగా చేసి, మళ్ళీ తనముందు లొంగిపోయేట్టు ఏర్పాట్లు చేశాడు. ప్రభుత్వం తనకు పునరావాసం కల్పిస్తాననడం సుశీల ను ఆశ్చర్యంలో ముంచెత్తింది. అవసరం లేదంటూ మర్యాదగానే త్రోసిపుచ్చింది. రచయిత్రిగా సుశీలకు ఇదివరకే పేరున్నందు వల్లనేమో పత్రికలు బాగా కవరేజి ఇచ్చాయి. పత్రికలవాళ్ళు అడిగిన ప్రశ్నలన్నింటికీ ఒకే ఒక్కమాట తన జవాబుగా చెప్పింది సుశీల. "ఏ పరిస్థితులయితే ఇక్కడ నాకు అసహ్యాన్ని కలిగించి ఆ ఉద్యమంలోకి వెళ్ళడానికి దారితీశాయో, అవే పరిస్థితులు అక్కడకూడా రాజ్యమేలుతుండటంతో వెనక్కిరాక తప్పలేదు" అని.

# ఇల్లీగల్ చైల్డ్!

వాణీ రంగారావు

అవునీక్షణంలో ఎక్కడో ఒకచోట
స్వంతదారుడి చిరునామా తెలియని
వీర్యకణం జోడీకట్టే ఉంటుంది
ముప్పైఆరు వారాల తరువాత
ఒకరోజో ఒక ఘడియో
అటో ఇటో
భయంకరంగా ఒక స్వప్నం
నిజమై కూర్చుంటుంది.
నిజం స్వరూపమై
బతుకు బతుకునీ
అంటిపెట్టుకునే ఉంటుంది.
చట్టం బంధనాలలోంచి
బైటికి అడుగేసిన
నిజం
రక్తమాంసాల వారసత్వాన్ని
వదలకుండా సత్యమై నిత్యమై
జీవం పోసుకుంటుంది.
శపించండి శపించండి.
అనాథలుగా దీవించండి.
అయినా
అబద్ధంలోంచి మాత్రం
రూపుదిద్దుకోలేని
మనిషి
శైశవం అనాథకాలేదు.
ప్రాణానికేమాత్రం
చట్టం వర్తించదు
ఊపిరి కేమాత్రం
న్యాయం దూరం కాదు.
కళ్ళు తెరిచిన నిజానికి
భూమి సత్యం
ఆకాశం దృశ్యం.
నీరు సత్యం
నిప్పు దృశ్యం
అమ్మ సత్యం
అమ్మే దృశ్యం
అమ్మని చట్టం చేయదు.
అమ్మకి చట్టం లేదు.

* *

ఉద్యమంలో తనకు జరిగినదాన్ని గురించి బాధపళ్ళేదు సుశీల. కాని, తనలో వున్న చీడపురుగుల్ని ఏరివేయకుండా ఆ ఉద్యమం సాధించేది ఏమీ వుండదన్న వాస్తవమే ఆమెను ఎక్కువగా బాధపెట్టింది. తనపై జరిగిన అత్యాచారాన్ని, పుడుతూనే బానిసగా మారుతున్న స్త్రీ శిశువుపై ఈ పురుషస్వామ్యవ్యవస్థలో రాజ్యమేలుతున్న మగదురహంకారం జరిపిన అత్యాచారంగా భావించింది సుశీల. 'ఫన్' కోసం తనతో సెక్సులో పాల్గొన్న వినోద్‌లోగాని, తనకు ఎక్కువపేరు రావడం సహించలేని అభ్యుదయవాది రవీంద్రలోగాని, కార్మిక-కర్షక రాజ్యం కోసం చేస్తున్న పోరాటం ముసుగులో సాటికార్యకర్తపై అత్యాచారానికి పాల్పడిన సత్తిరెడ్డిలోగాని, చివరికి.... తన తండ్రిలోనూ, తమ్ముడిలోనూ ఈ మగదురహంకారాన్నే సుశీల చూసింది. వాళ్ళ అహం దెబ్బతిందనుకున్న దశలో అందరూ ఆమె శీలంపై నిందవేసిన వాళ్ళే !.

సిటీ పొలిమేరల్లోవున్న ఓ రెసిడెన్షియల్ స్కూల్లో టీచర్‌గా చేరింది సుశీల. మళ్ళీ కథలూ, కవితలు రాయడం ప్రారంభించింది. ఇప్పుడామె గర్భవతి. ఈసారి అబార్షన్ చేయించుకోదల్చుకోలేదు సుశీల. నెలలు నిండుతున్నకొద్దీ మగపిల్లవాడు మాత్రం పుట్టకూడదని కోరుకుంది. కాని, ఆమె కోరికకు వ్యతిరేకంగా మగపిల్లాడే పుట్టాడు. అయినా బాధపళ్ళేదు సుశీల. ఒక సవాలుగా స్వీకరించింది.

రాడికల్ ఫెమినిస్టులు మగాళ్ళను 'మేల్ శావినిస్టిక్ పిగ్స్' అంటారు. ఆ మాటకు భావానువాదం అన్నట్టుగా, 'ఓ మగమద మృగాల్లారా!' అంటూ ఓ కవయిత్రి తన కవితలో వాడిన మాట సుశీలకింకా గుర్తుంది. ఇప్పుడు సుశీల ముందున్న ధ్యేయం ఒక్కటే - తన కొడుకును మరో 'మగమదమృగం' కానీయకూడదు. కనీసం వాని ద్వారా, తర్వాతి తరాలనుంచయినా స్త్రీ స్త్రీగా బ్రతకగల్గుతుంది.... బానిసగా కాదు. ●